# థ్రిల్



అరరే... ట్రయిన్ కదలబోతోందే అంటూ... హడావిడిగా పరుగులాంటి నడకతోవచ్చి ట్రయిన్ క్యాచ్ చేయబోతున్న ప్రియకు డోర్‌దగ్గరే నిలబడ్డ మోహన్ చేయి అందించాడు.

అతడి వంక చురచుర చూస్తూ, గత్యంతరం లేక చేయి అందుకొని ఎక్కిన ప్రియ ఆయాసంతో రొప్పసాగింది, లయబద్ధంగా కదులుతున్న ఆమె వక్షస్థలం నుంచి బలవంతంగా చూపులు వెనక్కి లాక్కుంటూ "చివరి నిమిషంలో రాకుంటే కాస్త ముందుగా వస్తే ఏంపోయింది? అయినా, రాజు మీతో వస్తాడనుకొన్నాను. రాలేదేం? కాసిన్ని మంచి నీళ్లు ఇమ్మంటారా" అంటూ ఆమె జవాబుకై ఎదురుచూడకుండా వాటర్‌బాటిల్ అందించాడు.

"థ్యాంక్స్. మీకన్నా చిన్నదాన్ని.. మీ ఫ్రెండ్ చెల్లెల్ని కాబట్టి నన్నేం మన్నించనక్కరలేదు" అంది బాటిల్ అందుకొంటూ.

"సరే ప్రియా..." వెంటనే అన్నాడు మోహన్.

"నన్నంతా రాగ అని గాని, రూప అని గానీ పిలుస్తారు"

"నాకు మాత్రం చివరి పదాన్నే పిలవాలని వుంది" అన్నాడు కొంటెగా.

'హు... అన్నీ రౌడీబుద్ధులే. ఈయనగార్ని నమ్మి పంపిన అన్నయ్యని అనాలి' అనుకొంది మనసులో.

"నేను రౌడీనిగాదండీ – చాలా మంచి బాలుణ్ణే" చటుక్కున అన్నాడు మోహన్. గతుక్కుమంది ప్రియ. ఏమిటీ తను మనసులో అనుకొన్నదతనికి ఎలా తెలిసింది... అనుకొంటూ ఖర్మ! ఇప్పుడు కూపేలో తామిద్దరే" లాస్ట్‌మినిట్‌లో హాండ్ ఇచ్చిన లలితని తిట్టుకొంటూ అనుకొంది ఆమె.

"నా ఫ్రెండ్‌కేదో పనిబడిరాలేదు. లేకుంటే ముగ్గురం ముచ్చట్లాడుకొంటూ ప్రయాణించే వాళ్లం – ఇప్పుడిక మనమిద్దరమే కలిసి వెళ్లక తప్పదు" అన్నాడు మోహన్.

"అమ్మో... ఇతనికి మనసు చదివే మంత్రం తెలుసు కాబోలు – మాటల్లో పడితే బోర్ అనేది ఉండదు" అనుకొంటూ అతని వంక కళ్లెత్తి చూసింది.


"కళ్లెత్తితే చాలు – కనకాభిషేకాల"ంటూ ఎవరు రాసారండి? ఆహా ఎందుకో అది గుర్తొచ్చింది. ఏదో ఒకటి మాట్లాడుకొంటూ వెళ్లామనుకోండి... బోర్ అనేది ఉండదు. పైగా తొందరగా గమ్యం చేరినట్లు ఉంటుంది – అందుకే ఏదో ఒకటి మాట్లాడుతూ ఉంటాను – భరించక తప్పదు – సుత్తి అనుకోకుండా వింటూండగలరా?" అన్నాడతను చిన్నగా నవ్వుతూ.

మరోసారి బిత్తరపోయింది రూప రాగ ప్రియ. అంతలోనే తేరుకొని 'సర్లెండి మీ గురించి చెప్పండి మరి...' అంది సంభాషణకు నాందిగా. అలా అడిగారు బావుంది. నా పేరు వెంకట నాగ

వాలి హిరణ్మయీదేవి



మోహన కృష్ణమూర్తి. అందరూ మోహన్ అంటారు. అమ్మ మాత్రం ముద్దుగా 'కృష్ణా' అంటుంది. నువ్వు ఎలా పిలిచినా నేనేమీ అనుకోను. ఎం.బి.యే. అయింది. కొన్నాళ్లుగా ఓ లిమిటెడ్ ఫర్మ్‌లో జాబ్ చేసి ఆ తర్వాత బిజినెస్ స్టార్ట్ చేసాను. దేవుడి దయవల్ల అది బాగానే ఉంది.



"ఉహు... అలాగా" అంది రూప ఉరఫ్ ప్రియ.

"మీ గురించీ చెప్పండి మరి" అన్నాడు ఆసక్తిగా మోహన్.

"నా పూర్తి పేరు రూప రాగ ప్రియ. పెళ్లికి వెళుతున్నాను" అంది. పుస్తకాన్ని తిరగేస్తూ - ఇంకేం మాట్లాడిస్తాడో అనుకొంటూ.

"ఏమిటి మ్యాగజైన్ తెరుస్తున్నారు. అంటే నన్ను నోరుమూసుకోమనా మీ అర్థం? లేక వీడితో ఏం మాటలనా?"

'బాబోయ్ - ఏమిటీ మనిషి - పుస్తకాన్ని చదివినట్టే మనసులో అనుకొన్నవన్నీ పసిగడుతున్నాడు' అనుకొంటూ "మాట్లాడ్డానికి ఏమున్నాయ్" అంది.

"ఏంలేవని? ఆవకాయ నుండి అమెరికా వరకూ ఎన్నో మాట్లాడుకోవచ్చు. పోనీ ఎవరికైనా బాల్యం బంగారం లాంటిది అంటారుగా. దాన్ని గురించి చెప్పండి"

"ఆ అండీలూ గిండీలూ వద్దు"

"సరే ప్రియా - వద్దులే గానీ నీ బాల్యం గురించి చెప్పు" అన్నాడు.

తన మధురస్మృతులను చెప్తూపోతుంటే టైమ్ తెలీలేదు. ట్రయిన్ ఆగగానే 'తినడానికేమయినా తేనా' అంటూ లేవబోయాడు.

"ఏమీ అక్కర్లేదు... నేను తెచ్చిన క్యారేజ్ వుంది. అది నలుగురికి సరిపోతుంది ఈజీగా" అంది రాగ ప్రియ. ఈ లోగా ట్రయిన్ కదిలి ఊపందుకుంది.

"మరి మిగిలిన ఇద్దర్నీ ఎక్కడి నుండి తెద్దాం" సీరియస్‌గా అడిగాడు.

"ఎవరూ అక్కర్లేదు. మిగిలినవి మనిద్దరికీ - రాత్రికి సరిపోతాయ్" అంది నవ్వుతూ.

"నవ్వుతూంటే మీ అందం విజృంభిస్తోంది" అన్నాడామెని చూస్తూ.

ఆమె కోపంగా చూసిం ది.

అమ్మో ఇప్పుడు - మా తెలుగు మాష్టారు వర్ణించిన సత్యభామలా ఉన్నారు" అన్నాడు.

"అబ్బ రౌడీ మనిషి" అనుకొంటూ అన్నీ వడ్డించి అతనికో ప్లేట్ అందించింది.

"ఇవన్నీ నువ్వు చేసినవేనా?" రుచి చూస్తూ అడిగాడు.

"అవును. బాగున్నాయా?" అడిగింది.

"అన్నింట్లోనూ ఉప్పు కారాలూ తక్కువే - వంట ఇంకా ఇంప్రూవ్ చేసుకోక తప్పదు" అన్నాడు సీరియస్‌గా.

'పోన్లే అని పెడితే వంకలు పెడుతున్నాడు' కినుకగా అనుకొంది రాగప్రియ.

"అవునూ - మనం పదింటికల్లా దిగిపోతాముగా" అడిగింది.

"ఆ... ఈ ట్రయిన్ కరెక్ట్‌గా వెళితే" అన్నాడు మోహన్. అతడలా అంటూ ఉండగానే... ట్రయిన్ ఆగిపోయింది. మోహన్ దిగివెళ్లాడు. ప్రియా - ముందు స్టేషన్‌లో రైలేదో పడిపోయిందట. పట్టాలు తప్పాయట. మన ట్రయిన్ ప్రొద్దుటిగ్గానీ కదలదట. ట్రయిన్‌లోనే ఉండే బదులు బస్‌నో మరోదాన్నో పట్టుకొని వెళ్లడం బెటరేమో అన్నాడు తిరిగొచ్చి.

'నిజమే' అనుకొంటూ తన సూట్‌కేస్, బ్యాగ్ తీసుకొని కిందకు దిగింది. ఆమె చేతిలోవి అందుకుంటూ బైటకు దారితీసాడు. అంతలో జోరున వర్షం స్టార్ట్ అయింది. "ఈ రాత్రివేళ

ఈ వర్షంలో ఏం దొరుకుతాయ్?" తనలో తను అనుకొన్నట్లు అంది రాగప్రియ.

"సరే – ఇక్కడేదైనా హోటల్లో రూమ్ దొరుకుతుందేమో ట్రై చేద్దాం" అన్నాడు. అయోమయంగా అతడిని అనుసరించింది ఆమె.

"ఇక్కడ చిక్కుబడ్డ విషయాన్ని తెలియజేద్దామంటే సిగ్నల్స్ దొరకడం లేదు" నిస్సహాయంగా సెల్ వంకచూస్తూ అంది.

"మరేం భయంలేదు. చెట్టంత మగాడిని నేతోడున్నాగా?"

"అదేగా నాభయం" మనసులో అనుకొంది ఆమె.

"నాగురించేమీ భయపడొద్దు. మోహనుడు చాలా మంచి బాలుడు" అని అతడు అంటూంటే "మనసులో కూడా ఏమీ అనుకోకుండా ఉండటం ఎలారా బాబూ" అనుకొంది. అదృష్ట వశాత్తూ రూమ్ దొరికింది.

"స్నానం చేసి ఫ్రెషయిరండి – భోజనానికి ఆర్డరిచ్చాను వేడిగా తినొచ్చు" అన్నాడతను స్నానం చేసి వస్తూ.

బురదగొట్టుకొన్న బట్టలతో ఉండలేక, సూట్‌కేస్ నుంచి బట్టలు తీసుకొని బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. కొన్ని నిమిషాలకే 'అమ్మ బాబోయ్' అన్న అరుపులు విని డోర్ తట్టాడు.

తలుపుతెరచిన ప్రియ – వణికిపోతూ అతడిని హత్తుకుపోయింది – ఓ మూలగా చూపిస్తూ.

కంగారుగా ఏమిటా అని తొంగిచూసిన మోహన్‌కి ఫకాల్న నవ్వొచ్చింది. మీసాల్ని కదిలిస్తూ కనబడ్డ బొద్దింకను చూసి.

అర్ధనగ్నంగా ఉన్న రూపప్రియ – మల్లె చెండు స్పర్శనిస్తూంటే షవర్ ఆన్‌చేసి బొద్దింకను అవతల పారేసాడు. ఈలోగా అతడు మళ్లీ తడిసిపోయాడు.

ఆ షవర్ కింద ఆమెతోపాటూ తడుస్తూ "వీటినే సరిగంగ స్నానాలు అంటారు పెళ్లికి ముందు చేయిస్తారు" అన్నాడు.

సిగ్గుతో అతడిని బైటకు పంపేసి స్నానం ముగించి డ్రెస్సయి వచ్చింది రూపరాగ ప్రియ.

ఆ చల్లటి వాతావరణంలో వేడివేడి భోజనం బహుకమ్మగా తోచింది ఇద్దరికీ. కిటికీలోంచి తొంగి చూస్తే రోడ్లన్నీ కడిగినట్లు తళతళ మెరుస్తూ కన్పించాయ్ వెన్నెల్లో. "అబ్బ! బైట వెన్నెలెంత బాగుందో... బైటకెళ్లి ఏమన్నా బస్‌లు లేదా మరేదన్నా వెహికల్ దొరుకుతుందేమో చూద్దామా" అన్నాడు మోహన్. ఉషారుగా ఈలవేస్తూ దిగుతున్న మోహన్‌ని వెనుకనుండి చూస్తూ 'ఎంత మంచి పర్సనాలిటీనో ఇతనిది' అనుకొంటూ దిగింది రూప. రోడ్ చివరి వరకూ వెళ్లాచ్చారు. చలి కొంటెగా వణికిస్తూంటే ఒకరి చేతులు మరొకరి చేతుల్లో జొనిపి, నడక సాగించారు.

"వెన్నెలలోని వేడి ఏలనో
వేడిమిలోని చలువ ఏలనో
ఈ మాయ ఏమో జాబిలీ
ఈ మత్తు ఏమో జాబిలీ"

మోహన్ పాడుతూంటే "అబ్బో... భావావేశం పొంగిపొర్లుతోందే..." అంది నవ్వుతూ.

"మరి – మడిసన్నాక కూసింత 'కలాపోసనుండాలి' అన్నాడతను రావు గోపాల్‌రావు గొంతుని ఇమిటేట్ చేస్తూ.

"అలాగని 'మాయాబజార్' సినిమాలోలా వెన్నెల్లో జలవిహారాలు చేద్దామని ఉందేమిటి?"

"ఎగ్జాక్ట్‌గా నువ్వన్నదే నా మనసులో కదు

లుతున్న కోరిక. కానీ ఓ బోట్ లేదు - ఓ చెరువూ లేదు" అన్నాడు మోహన్.

"లేని వాటి గురించి చింత ఎందుకు? ఉన్న వెన్నెల్ని మనసారా ఆస్వాదిస్తే చాలదూ"...

"అటు వెన్నెల ఇటు వెన్నెల
ఎటు చూస్తే అటు వెన్నెల"

అంటూ సన్నగా హమ్ చేయసాగిందామె.

"ఫర్వాలేదే... గొంతు వినసొంపుగానే ఉంది" అన్నాడు మోహన్.

"థ్యాంక్స్" అంది ప్రియ నవ్వుతూ. నడిచి అలసిపోయారేమో - హోటల్‌కి వెళ్లగానే కమ్మగా నిద్ర పట్టేసింది.

ప్రొద్దుటే లేచి స్నానంచేసి, తయారై బెడ్ దగ్గరకు వచ్చి నిద్రపోతున్న మోహన్ నుదుట చుంబించి -

'చలో ఏక్ బార్ ఫిరసె అజ్‌నబీ బన్ జాయె - హమ్‌దోనో' అనుకొంటూ "మనిద్దరం ఇంత వరకూ అపరిచితుల్లా నటించడం... రైల్లో ఉయ్యాలలూగే కూపేలో ప్రయాణం... నిన్న సరి గంగస్నానాలు... వెన్నెల విహారాలూ... అన్నీ ఈ వయసులో చాలా బాగున్నాయికానీ - ఇక చాలు. పిల్లల్ని వదిలి ఉండటం మాత్రమే కాస్త కష్టంగా ఉంది. ఇక ఇంటి కెళ్లిపోదాం - లేచి తయారవండి" అంది.

"ఓకే ఏజ్ యూ విష్" అంటూ తయారైవచ్చాడు. ఇద్దరూ సూట్‌కేసులు తీసుకొని హోటల్ రెంట్ చెల్లించి బైటికొచ్చారు.

* * *



హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలో మానస ఆర్ట్ థియేటర్స్, గానసభల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డా॥ గుడికాడి ఆంజనేయులు రచించిన 'కులపురాణాలు - గౌడపురాణం' పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, దీక్షితులు, ఆచార్య టి. కిషన్‌రావు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య బిట్టు వెంకటేశ్వర్లు, గ్రంథకర్త ఆంజనేయులు.

"అబ్బ... కాళ్లు నొప్పులు" అంది రాగప్రియమ్మ.

"ఇప్పుడే నొప్పులంటే ఎలా? నెక్స్ట్ ఇయర్ మనకి షష్టిపూర్తి చేసి మళ్లీ హనీమూన్‌కి అరకు పంపించే ఏర్పాట్లలో మన పిల్లలు ఉంటే..." అన్నాడు మోహన్ ఉరఫ్ మోహన కృష్ణమూర్తి. అతడి చేతుల్ని ప్రేమగా తన బుగ్గలకు ఆనించుకొని ప్రేయసీ ప్రియుల్లా – అపరిచితుల్లా కనీసం ఓ రెండ్రోజులు గడపాలనుకొన్న నా కోరిక తీర్చారు. ఈ అనుభూతి చాలు... మిగిలిన శేషజీవితం అంతా తీయగా నెమరు వేసుకునేందుకు" అందామె.

"నాకూ అలాగే ఉంది. ఇంకో రెండ్రోజులు ఉండి మరిన్ని తీయటి అనుభవాలను పొందాలని ఉంది ఏం...? నీకలా లేదా?" అడిగాడు.

"మన ప్రేమని మావాళ్లు కాదన్నప్పుడు, కులాలు వేరంటూ మనల్ని విడదీసినపుడూ చచ్చిపోవాలనుకున్నాను. ఎవరితోనో పెళ్లి నిర్ణయించేసి చస్తామని బెదిరిస్తే, ముక్కూమొహం తెలీని వ్యక్తితో మూడు ముళ్లూ వేయించుకున్నాను. నా జీవితం ఎలా ఉంటుందోనన్న చింతకన్నా నేను లేని నువ్వు ఏమయిపోతావోననే ఎక్కువ కుమిలిపోయాను.

అతగాడు ఏడాది తిరక్కుండా ఏక్సిడెంట్‌లో చనిపోతే, ముదనష్టపుదానివని అత్తింటివాళ్లు తరిమేసారు. కులానికి ప్రాధాన్యత ఇచ్చి చేసిన పెళ్లి అలా పెటాకులయ్యేసరికి బెంగతో అమ్మా నాన్నా కాలం చేసారు. అన్నావదినలు నన్ను గుండెల మీద కుంపటిగా భావించి ఆరళ్లు పెట్టడం, కొంటెవెధవలు నన్ను లొంగదీసుకోవాలని చూడటం వీటితో వేగిపోయి చావే శరణ్యమనుకొంటున్న సమయంలో, ఆ నరకంలో నుండి నన్ను ధైర్యంగా బైటకు తీసుకొచ్చి, అందర్నీ ఎదిరించి నా మెళ్లో మూడుముళ్లూ వేసి కొత్త జీవితాన్నిచ్చావ్. నిజమైన ప్రేమ ఎలాగైనా ఫలిస్తుందని ఎంతో నమ్మకంతో నిరీక్షించావు. ఇంతకు మించిన థ్రిల్ ఏముంది? పిల్లలతో, మనవలతో సంతృప్తిగా గడిపే జీవితాన్ని అనుభవిస్తున్నానంటే అది నీ చలవే. అమ్మమ్మగా, నానమ్మగా మారినా, ఇంకా అలనాటి ఆ ప్రేయసినే నాలో ఇప్పటికీ చూసుకుంటున్నావ్. ఇంతకు మించిన థ్రిల్ నాకేముంటుంది?" అంది రాగప్రియ ఉద్వేగంగా.

"చేదుగతాన్ని తవ్వుకోవడం ఇప్పుడు అవసరమా ప్రియా? అప్రియమైన వాటిని ఎంతగా మరిచిపోతే అంత మంచిది. ప్రేమకు జనన – మరణాలు లేవు – అది నిత్యం ప్రవహించే చైతన్యం నింపుకున్న నదిలాంటిదని నమ్ముతూ జీవితాన్ని ఆనందప్రదం చేసుకోవాలి" అన్నాడు మోహన్.

ఇంతలో సెల్ మోగింది.

"హలో... రాహుల్ మేమిద్దరం ఓ.కే." అంటూ రాగప్రియ వంక తిరిగి, "ప్రియా! మన ప్రయాణపు విశేషాల గురించి అడుగుతున్నాడు నీ మూడో కొడుకు. చెప్పమంటావా" అనడిగితే, ఎర్రగా అతని వంక చూసింది ఆమె. ఫోన్ ఆఫ్‌చేసి "ఆ... ఇక మళ్లీ నిత్య నిజజీవితంలోకి రావాల్సిన సమయం వచ్చింది. రాహుల్ తను ప్రేమించిన అమ్మాయి ఇంటికి వెళ్లి వాళ్ల పెద్దలను పెళ్లికి ఒప్పించాడట. కాబట్టి పెళ్లి పనులతో బిజీ. ప్రేమ పేరిట చిట్‌చాట్‌లు, పార్క్‌లు, సినిమాలంటూ తిరక్కుండా ఏకంగా పెళ్లికే తీసుకొచ్చాడు నా కొడుకు" గర్వంగా అన్నాడు మోహనకృష్ణమూర్తి.

"మరి వాడెవడు? ప్రేమకు ప్రతిరూపమైన మీ కొడుకు కాదూ..." అంటూ నవ్వింది రూప రాగప్రియ.